క్లుప్తంగా

వాహనాల తనిఖీ



కారును పరిశీలిస్తున్న ప్రొహిబిషన్ ఎస్సై రాజన్‌కుమార్

మల్హర్ : మండలంలోని కొండంపేట క్రాస్ వద్ద కొయ్యూరు పోలీసులు మంగళవారం వాహనాల తనఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మంథని–కాటారం వైపు వెళ్తున్న వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనానికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, అనుమానితులను విచారించి వదిలేశారు. ప్రొహిబిషన్ ఎస్సై రాజన్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ



చిట్యాల : మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన బెంబీరి మధుకర్, నేరెళ్ల అరుణ్, గొల్లపల్లి అనిల్ మంగళవారం చల్లగరిగ గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు బెంబీరి బాపురావు టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు వేణు, శ్రీకాంత్, రాజు, అనిల్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

కాళేశ్వరం : తమ జీతాలు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిని కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న మహదేవపూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బందిని ముందస్తుగా మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ కేసర్‌సింగ్, కారోబార్ రమేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతులకు రాయితీపై పనిముట్లు

మల్హర్ : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో (సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) భాగంగా మహిళా రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శ్రీజ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పట్టాభూమి కలిగి, ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఈనెల 26వ తేదీలోగా కొయ్యూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అందుబాటులో వ్యవసాయ పనిముట్లు

కాటారం : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి మహిళా రైతులకు పలు రకాల వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పూర్ణిమ మంగళవారం తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు–5, పవర్ స్ప్రేయర్లు–5, రోటోవేటర్లు–2, కల్టివేటర్లు–2, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్స్, బండ్ ఫార్మర్, ట్రాక్టర్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళా రైతులు ఏఈఓలకు దరఖాస్తులు అందజేయాలని ఏఓ సూచించారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా శంకర్

రేగొండ : మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయ కమిటీ చైర్మన్‌గా ముడుతనపల్లి శంకర్ నియమితులయ్యారు. మంగళవారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శంకర్ మాట్లాడుతూ.. శ్రీరామ నవమి వేడుకలు ఆలయంలో ఘనంగా నిర్వహిస్తామని, ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణ వేడుకను వీక్షించాలని కోరారు. ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



నిమ్మల శ్యామ్

రేగొండ : యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ కొత్తపల్లిగోరి గ్రామ కన్వీనర్‌గా నిమ్మల శ్యామ్‌ను నియమించినట్లు మండల అధ్యక్షుడు మాస్ రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ..అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార హక్కు చట్టం ఒక ఆయుధంగా పని చేస్తోందన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

శంకుస్థాపనలకే పరిమితం



అధ్వానంగా ఉన్న టేకుమట్ల–సుబ్బక్కపల్లి రోడ్డు



తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల శిలాఫలకం



ఎంపేడు–వెల్లంపల్లి రోడ్డుకు..

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు
- ప్రారంభం కాని అభివృద్ధి పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

టేకుమట్ల : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి, కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోతున్నాయి. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో అరకొర వసతులు, శిథిలమైన మట్టి రోడ్లతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు, వ్యవసాయ రోడ్లు, ప్రభుత్వ భవనాలు తదితర పనుల నిర్మాణానికి అధికారులు, పాలకులు శంకుస్థాపనలు చేశారు. కానీ పనులు ఎందుకు ప్రారంభించలేదో తెలియడం లేదు. మండలంలోని వెల్లంపల్లి–ఎంపేడు ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. మరోమూడు నెలల్లో వర్షాకాలం ఉండడంతో మళ్లీ బురద రోడ్డే శరణ్యమంటే ఎంపేడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వెలిశాల–రాఘవాపూర్ మధ్య గల వ్యవసాయ బావులకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి 2019లో రూ.2.70 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మరిచిపోయారు. వెలిశాల, రామకిష్టాపూర్, పెద్దంపల్లి, పంగిడిలపల్లి, రాఘవాపూర్ రైతులు వర్షాకాలంలో బురద రోడ్డులో ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.టేకుమట్ల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సుబ్బక్కపల్లి వరకు రూ.2కోట్ల నిధులతో 2020లో శంకుస్థాపన చేశారు.కానీ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు శంకుస్థాపనలు..

మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం గతేడాది రూ.3కోట్ల నిధులు కేటాయించగా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో అరకొర వసతుల నడుమ అధికారులు, కార్యాలయాలకు వచ్చే మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డులో గల లోలెవల్ కల్వర్టును హైలెవల్ కల్వర్టుగా నిర్మించేందుకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. అంతే కాకుండా ఓడేడ్–కలికోట మానేరులో అంతర్ జిల్లా వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 2016లో రూ.45కోట్ల నిధులు కేటాయించగా పనులు పూర్తికాక ఇప్పటికీ అసంపూర్తిగా ఉండడంతో నిత్యం పెద్దపల్లి, మంచిర్యాల, గోదావరిఖని పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వేసవి కాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వానాకాలంలో బురద రోడ్డే దిక్కు



వెలిశాల–రాఘవాపూర్ రోడ్డు వైపు మా వ్యవసాయ భూమి ఉంది. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలిపెట్టారు. ఇప్పటికైనా పనులు ప్రారంభిస్తే రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– శాస్త్రాల సమ్మయ్య, పెద్దంపల్లి

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



ఎంపేడు–వెల్లంపల్లి ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు, కానీ ఇప్పటి వరకు ఏ కాంట్రాక్టర్ నిర్మాణాన్ని ప్రారంభించలేదు. మరో మూడు నెలల్లో వర్షాకాలం రాబోతుంది. కాబట్టి ఇప్పుడే పనులు ప్రారంభిస్తే వర్షాకాలం వరకు పూర్తి చేయవచ్చు. ఆలస్యమైతే వర్షాకాలంలో మాకు బురదరోడ్డే దిక్కు.

– కొలిపాక రాజయ్య, మాజీ సర్పంచ్ ఎంపేడు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవీందర్

చిట్యాల : ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో యూత్ అండ్ ఎకో క్లబ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ, జ్యోత్స్న, వాణి, శ్రీలత, రాజు, రాజేంద్రప్రసాద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి మంత్రి పరామర్శ



నితిన్‌కు క్రికెట్ బ్యాట్ అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పలిమెల : మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన బౌతు నితిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ.. 'సార్ నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలలు గన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండ'ని అడగడంతో భావోద్వేగానికి గురైన మంత్రి శ్రీధర్‌బాబు వెంటనే క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. ఏ అవసరమున్నా తనను నేరుగా సంప్రదించాలని బాధితుడి తల్లిదండ్రులకు సూచించారు.

గంజాయి నిర్మూలనపై పోరాటం

- జిల్లా కార్యదర్శి శ్రీకాంత్
- డీవైఎఫ్ఐ మహాసభ వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

భూపాలపల్లి రూరల్ : జిల్లాలో గంజాయి నిర్మూలనపై దశల వారీగా పోరాటాలు చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా మహాసభను అనివార్య కారణాల వల్ల మే 25,26వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మద్యం, బెల్టు షాపులు, గంజాయి నిర్మూలనపై నూతన కార్యచరణకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భూక్య నవీన్, ఉపాధ్యక్షులు గడ్డం కవిత, గుడికందుల దేవేందర్, బందు సుజాత, జిల్లా కమిటీ సభ్యులు, జ్ఞానేశ్వరి, బుర్ర స్వాతి, అజ్మీరా సరిత, ఎర్ర సుజాత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, మహిళా సాధికారత, సఖి కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం బాలల హక్కులపై, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు సుకన్య సమృద్ధి యోజన,'బేటి బచావో–బేటి పడావో' పథకంపై మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్‌లైన్, బాల్య వివాహాల నిర్మూలన చట్టాలను వివరించారు. మహిళలు సాధికారతను సాధించేందుకు సంపూర్ణ అవగాహన కల్పించారు. బాలల అక్రమ రవాణా, చిన్నారుల సమస్యల పరిష్కారం కోసం 1098, వృద్ధుల సమస్యల పరిష్కారానికి 14567, మహిళా సమస్యల పరిష్కారానికి 181, సైబర్ క్రైమ్ సమస్యలకు 1930 టోల్ ఫ్రీ నంబర్లు వినియోగించుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, మహిళా సాధికారత ఇన్‌చార్జ్, కోఆర్డినేటర్ అనూష, జెండర్ స్పెషలిస్ట్ మమత, సఖి సరిత, అంగన్‌వాడీ టీచర్స్, కిశోర బాలికలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కు ఎంపిక



హన్సిక

చిట్యాల : మండలంలోని ఒడితలలోని శ్రీ వివేకానంద పబ్లిక్ పాఠశాలలో చదువుతున్న అచ్చ హన్సిక మంగళవారం వెలువడిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గొర్ల సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.



సనిత్‌కుమార్

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి కొక్కు సనిత్‌కుమార్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆరోతరగతి ప్రవేశానికి విద్యార్థి ఎంపిక కావడంతో విద్యార్థినిని, తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

టేకుమట్లలో..



సహస్ర

టేకుమట్ల : మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన భూపెల్లి సహస్ర నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మియాపురం హరీష్‌కుమార్ తెలిపారు. అనంతరం విద్యార్థిని సహస్రను ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో పోలీసుల విలేజ్ వాచ్



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాసమస్యలను గుర్తించడంతో పాటు సమన్వయం చేసేందుకు స్థానిక పోలీసులు విలేజ్ వాచ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీసుల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజల వద్దకే పోలీసు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని 18 గ్రామపంచాయతీలకు ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకునేందుకు వాటి పరిష్కారం కోసం ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో రెండు గంటల పాటు గ్రామస్తులతో ఆ గ్రామ కానిస్టేబుల్ సమావేశం ఏర్పాటు చేసేలా షెడ్యూల్ రూపొందించారు. గ్రామాల్లోని ఫిర్యాదుల, కేసుల నమోదు, గ్రామాల్లోని సమస్యలను సమావేశం ద్వారా ప్రజల నుంచి తెలుసుకుని పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. గ్రామాల్లో యువత చెడు మార్గం వెళ్లకుండా మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు కూడా మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



సర్టిఫికెట్లు అందజేస్తున్న సభ్యులు

కాటారం : మండల కేంద్రంలో జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం నాబార్డు డీడీఎం రవికుమార్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో అలీప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పనలో భాగంగా మహిళలకు మండల కేంద్రంలో జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి కావడంతో 90 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం రవికుమార్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలతో స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని సూచించారు. సబ్సిడీలో కుట్టు మిషన్లు అందించడంతో పాటు ఆర్థిక తోడ్పాటును అందజేస్తామని తెలిపారు. అలిప్ సంస్థ సభ్యుడు భరత్ రెడ్డి, శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ సూర్యదేవర వనిత, మహిళలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై దివ్య

రేగొండ : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ట్రెయినీ ఎస్సై దివ్య మంగళవారం బాధితుడికి అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సమ్మయ్య, ప్రసాద్ పరకాలకు వెళ్తుండగా తమ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైన ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ట్రెయినీ ఎస్సై సూచించారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



గోవిందరావుపేట: పాపయ్యపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాపయ్యపల్లిలో గ్రామస్తులతో మాట్లాడారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగుల్లో లక్షల రూపాయలు పోగొట్టుకొని యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని సూచించారు. యువతకు అవసరాలకు మించి డబ్బులను ఇవ్వకూడదని అన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే 100 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లలో బెట్టింగ్ యాప్‌లు ఉన్న, బెట్టింగ్‌లకు పాల్పడిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. సమాచారం అందించిన వారికి పారితోషికం అందిస్తామని ఎస్సై తెలిపారు.

కన్నాయిగూడెం: సులువుగా డబ్బులను సంపాదించవచ్చనే భావనతో బెట్టింగ్ యాప్‌లకు మొగ్గు చూపి ప్రాణాలు పోగొట్టుకోవద్దని స్థానిక ఎస్సై ఇనిగాల వెంకటేశ్ అన్నారు. వాటిపై యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లతో బెట్టింగ్‌లు విపరీతంగా జరిగే సమాచారం ఉన్నందున ఈ లావాదేవీలు ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల నుంచి బెట్టింగ్ యాప్‌లకు చేరే అవకాశం ఉందన్నారు. ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌ల బారిన పడి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి



చిట్యాల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశవర్కర్లు



కాటారం: అంబేడ్కర్ విగ్రహానికి వినతి..

చిట్యాల : ఆశ వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల రజనీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేస్తుండగా వారికి రజనీకాంత్ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత, పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్స్ ఫెడరేషన్ ఇండియా జాతీయస్థాయిలో ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు రాధిక, స్వప్న, సరోజన, మానస, సాయివేద, సుమలత, కృష్ణవేణి, విజయ, కవిత, జ్యోతి, స్రవంతి, రమ, కల్పన, భాగ్యలక్ష్మి, ప్రమీల, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో ఆశ కార్యకర్తల నిరసన

కాటారం : ఎన్నికల సమయంలో ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తలు నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశ కార్యకర్తలకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం అందజేయడంతో పాటు ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, రూ.50 వేల ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం కమిషనరేట్ ఎదుట ధర్నాకు వెళ్లిన ఆశ కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని గాయపర్చడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వైఖరి మార్చుకొని ఆశ కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కె.రాజేశ్వరీ, జయప్రద, పద్మ, రమాదేవి, లత, సమ్మక్క, స్వరూపారాణి, లక్ష్మి, నాగమణి, స్వరూప, వసంత, శైలజ, పార్వతి, కాంత, జ్యోతి, లక్ష్మి, శారద, అరుణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు అధికం అవుతున్నాయని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రయాణికులకు, కూలీలకు బాటసారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లిన తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆరోగ్య పరమైన ఇబ్బందులు బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. శరీరం నుంచి చెమట రూపంలో కోల్పోయిన లవణాలను తిరిగి పొందేందుకు మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే వెంటనే అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం



మొగుళ్లపల్లి : మండలంలోని బంగ్లాపల్లి గ్రామంలో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరంలో పశువులకు వ్యాధుల నిర్ధారణ, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండీ రఫీ, డైరెక్టర్లు లింగయ్య, సతీష్ రెడ్డి, సెక్రటరీ కనుక శేఖర్, పశు వైద్యాధికారి రాకేష్ శర్మ, ఎం.వెంకటేష్, గోపాలమిత్రలు శ్రీనివాస్, రాజన్న, అశోక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.